క్లుప్తంగా

ప్రతిపక్ష పార్టీలపై దాడులు మంచిది కాదు

తిరుపతి కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, నాయకులపై అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, నేతలు దాడులు చేయడం మంచిది కాదని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ సంయుక్తంగా ఏర్పాటైన ఎన్డీఏ కూటమి ద్వారా 164 సీట్లు గెలుచుకొని అధికారం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. అనేక నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తామని బెదిరింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమని తెలిపారు. పుంగనూరు నియోజకవర్గానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రానీయమంటూ దాడి చేస్తామని బెదిరింపు చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్య దేశంలో మంచిది కాదని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని కోరారు.

జర్నలిస్టు సమాజానికి రుణపడి ఉంటా..

తిరుపతి కల్చరల్: తనను అక్కున చేర్చుకుని, ఎదుగుదలకు తోడ్పాటునిచ్చిన జర్నలిస్టులకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని పూతలపట్టు ఎమ్మెల్యే, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కె.మురళీమోహన్ తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన మురళీమోహన్‌ను ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొని ఆయన్ను సత్కరించారు. ప్రెస్‌క్లబ్‌కు సొంత స్థలం సమకూర్చే బాధ్యతను, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు సాధించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుళతానని తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, బాలచంద్ర, కోశాధికారి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రమేష్, సునీల్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు



విశేషాలంకరణలో తిరుపతి గంగమ్మ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులోని తిరుపతి గంగమ్మ, యడమవారిపల్లెలోని శ్రీకృష్ణప్రియ ద్రౌపదీ అమ్మ వారి ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు చేపట్టారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, అర్చనలు అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. తిరుపతి గంగమ్మకు భక్తులు అంబలి తీసుకొచ్చి నైవేద్యం పెట్టి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

తిరుపతి(అలిపిరి): యోగా చేయడంతో మానసిక ఒత్తిడిని దూరమవుతుందని, ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం యోగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా యోగా సమితి, భారత స్వాభిమాన్ సంయుక్తంగా చేపట్టిన అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే ఆరణి ప్రారంభించారు. అనంతరం ప్రకాశం మున్సిపల్ పార్కులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగాను నిత్యం అలవాటు చేసుకోవాలని.. ఆరోగ్యంగా ఉంటేనే మంచి ఆలోచనలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పతంజలి యోగా సమాజం ప్రతినిధి కైలాస్ సింగ్ రాజ్ పురోహిత్, జగన్నాథం, ఓటేరు కృష్ణ, యోగా గురువులు ప్రభాకర్, తంగరాజ్, రాధిక, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ చిరంజీవి

రామచంద్రాపురం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆదివారం మండలంలోని సీరామాపురం ప్రధాన రహదారి వద్ద తిరుపతి, పచ్చికాపల్లం వైపు వెళ్తున్న వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపినా, వారికి బండ్లు ఇచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు లైసెన్సు తప్పకుండా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో తెలంగాణ మంత్రి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ మధు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తిరువీధుల్లో స్పీడ్ బ్రేకర్లు

తిరుపతి నగరంలోని వీధుల్లో పశువులే స్పీడ్ బ్రేకర్లుగా మారుతున్నాయి. ఆవులు, గేదెల యజమానులు ఇష్టారాజ్యంగా వదిలేస్తుండడంతో రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ పడుకుంటున్నాయి. దీంతో చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎటునుంచి ఏ పశువు దూసుకొస్తుందో తెలియక బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు ఈ పరిస్థితిని నియంత్రించడంలో ఘోరంగా విఫలమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



లీలామహల్ ప్రధాన కూడలి వద్ద తిష్ట వేసిన పశువులు



చేపల మార్కెట్ రోడ్డులో వాహనాలకు అడ్డుగా పశువులు



ప్రధాన రోడ్డు మధ్యలో డివైడర్లపై మొక్కలు తింటున్న పశువులు



మంగళం కరకంబాడి ప్రధాన రహదారిపై...



వాహనాలపైకి దూసుకు వెళుతున్న పశువులు



అన్నారావు కూడలిలో పశువుల సంచారం

ధ్యానం గంగా స్నానం చేసిన ఫలితాన్నిస్తుంది



ధ్యాన కార్యక్రమాల సమరం జీవామృతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ వీజీఓ బాలిరెడ్డి, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ధ్యానాన్ని మించిన పుణ్యఫలం అందించేది మరొకటి లేదని, ధ్యానం పవిత్ర గంగానదిలో స్నానం చేసినంత ఫలితాన్ని ఇస్తుందని టీటీడీ వీజీఓ బాలిరెడ్డి తెలిపారు. తిరుపతి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో దశ పాప హర దశమి సందర్భంగా మూడు రోజులుగా ప్రకాశం రోడ్డులోని ఎస్వీ ధ్యాన మందిరంలో నిర్వహించిన ధ్యాన జ్ఞాన యజ్ఞం కార్యక్రమం ఆదివారం సాయంత్రంతో ఘనంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి టీటీడీ వీజీఓ బాలిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇంటిలోనే ధ్యానం చేయడం ద్వారా పది రకాల పాపాలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. ధ్యానులు మాత్రమే ప్రశాంతమైన జీవితాన్ని గడపగలరని తెలిపారు. అనంతరం ఆయన ధ్యాన కార్యక్రమాల సమరం జీవామృతం పుస్తకాన్ని ఆవిష్కరించారు. తర్వాత తిరుపతి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురామ్ మాట్లాడుతూ గురూజీ బ్రహ్మర్షి పత్రీజీ ఆశయం మేరకు 2024 నవంబర్ 11వ తేదీ ఆయన జయంతిని పురస్కరించుకొని నగరంలో తిరుపతి సహస్ర గృహ ధ్యాన పరిచయ ప్రచార కార్యక్రమాన్ని పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 600 గృహాలలో ధ్యాన కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ఎం.సుబ్రమణ్యం, డి.ప్రవీణ్‌కుమార్, కె.జయచంద్ర ఆచారి, ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

రోగ నిర్ధారణ ప్రథమ కర్తవ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖరన్

తిరుపతి తుడా: ఏదైనా అనారోగ్యం ఎదురైనప్పుడు వెంటనే రోగ నిర్ధారణ చేసుకోవడం ప్రథమ కర్తవ్యమని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. ఎస్వీ మెడికల్ కళాశాల జీవ రసాయన శాస్త్ర విభాగంలో ఆదివారం అత్యవసర రోగ నిర్ధారణ–సవాళ్లు అంశంపై నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్వీ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థులతోపాటు కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు, కుప్పం, స్విమ్స్ మెడికల్ కళాశాలలకు చెందిన వైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రోగనిర్ధారణ కాకుండా ఇష్టం వచ్చినట్లు మందులు వాడితే ఇతర అనారోగ్య సమస్యలు ఎదుర్కోక తప్పదన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలను వైద్య విద్యార్థులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. ఆధునిక వైద్య విధానంపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై దృష్టి సారించాలన్నారు. జీవ రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.మాధవి లత, వైద్యులు డాక్టర్ కిరీటీ, డాక్టర్ కొండేటి మాధవి పాల్గొన్నారు.

పేదల ఆసుపత్రిలో తాగునీటి కష్టాలు

రాయలసీమకి తలమానికమైన శ్రీవెంకటేశ్వర రుయా ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. దాతల సహాయంతో జల ప్రసాదం ద్వారా తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. ఈ జల ప్రసాదంలో తాగునీరు సరిగ్గా రాకపోవడంతో ఆస్పత్రికి వచ్చేవారు దాహార్తితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాహానికి పక్కనే ఉన్న దుకాణాల్లో డబ్బులు పెట్టి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం జల ప్రసాదం వద్ద రోగుల సహాయకులు క్యూలో నిలబడి తాగునీరు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.



ఆస్పత్రిలో ప్రతి చోటా కనీస అవసరమైన తాగునీరు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. – తిరుపతి తుడా

రుయాలో కుక్కల బెడద

పేదలకు ఆరోగ్య దేవాలయంగా పేరుగాంచిన రుయా ఆసుపత్రిలో కుక్కలు వీరంగం చేస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎంతో అవస్థలు పడి పేద రోగులు, వారి సహాయకులు రోజూ రుయా ఆసుపత్రికి చేరుకుంటున్నారు. అయితే రుయా ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ, జనరల్ వార్డ్ తదితర ప్రాంతాల్లో కుక్కలు తిరుగుతున్నాయి. రోగులు, వారి సహాయకులు, డాక్టర్లు, నర్సులు వెంట పడుతున్నాయి. అయితే సంబంధిత అధికారులు సిబ్బంది వాటిని వెళ్ళగొట్టే చర్యలు చేపట్టకపోవడంతో ఆస్పత్రిలో ఇబ్బందులు తప్పడం లేదు. – తిరుపతి తుడా



స్ట్రెచర్ కష్టాలు



రుయా ఆసుపత్రికి అత్యవసర చికిత్స కోసం వచ్చేవారు నడవలేని పరిస్థితి ఉంటారు. వారిని వార్డుకు స్ట్రెచర్‌పై తీసుకు వెళుతుంటారు. అయితే ఆ స్ట్రెచర్‌పై ఒక వైపు రోగి మరోవైపు ఆసుపత్రికి సంబంధించిన పరికరాలను తీసుకువెళ్లే పరిస్థితి దాపురించింది. ఈ దృశ్యం రుయాలో ఆదివారం కనిపించింది. లేవలేని స్థితిలో ఉన్న రోగిని ఇలా స్ట్రెచర్‌పై కూర్చోబెట్టి తీసుకెళ్లడం చర్చనీయాంశమైంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భరత నాట్యంతో అలరిస్తున్న కళాకారులు



సినిమా పాటలకు నృత్యం

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లికి చెందిన కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో భక్తి, జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పాటలకు కళాకారులు రాజేష్, మస్తాన్, లహరి, భరత్, మధుశ్రీ, అనుష్క, చిత్ర, నేహల్య, మధు, లక్షిత, మేఘన, లోకేశ్వరి, ప్రియా, శరత్ కుమార్, హేమంత్, జస్వంత్, సాహిత్, ధరరాజ్, అక్షిత, తేజ, వైష్ణవి, దివ్య, దర్శన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విషపూరిత వయ్యారి

- సమస్యాత్మక కలుపు మొక్కగా వయ్యారిభామ
- రైతులకు చర్మవ్యాధులు
- పంటలకు చీడపీడలు



వేరుశనగ పంట చుట్టూ వయ్యారిభామ, (ఇన్‌సెట్) పార్థీనియం మొక్క

భాకరాపేట: జిల్లాలో సమస్యాత్మక కలుపు మొక్కగా మారిన వయ్యారి భామ (పార్థీనియం) విస్తారంగా వ్యాపించి రైతులను పట్టి పీడిస్తోంది. ఒక హానికరమైన కలుపు మొక్కగా దీనిని కాంగ్రెస్‌గడ్డి, నక్షత్ర గడ్డ, మంగమ్మచెట్లు అని పిలుస్తారు. దీనిని నివారించేందుకు జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి–న్యూఢిల్లీ, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం–తిరుపతివారు జిల్లాలో వయ్యారి భామను నిర్మూలిద్దాం–ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టారు. ఈ కలుపు మొక్కను సామూహికంగా నిర్మూలించక పోతే రైతులకు తీరని నష్టం చేస్తుందని రాస్–కేవీకే శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక్కొక్క మొక్క 10 వేలు నుంచి 50 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. పంట పొలాల్లోను, బీడు, బంజరు, జనావాసాలు చుట్టూ, పాడుబడిన ప్రదేశాల్లోనూ విస్తారంగా పెరుగుతుంది.

వయ్యారి భామ (పార్థీనియం) మొక్క వలన కలిగే నష్టాలు..

- పంట పొలాల్లో 40 శాతం, పశు గ్రాసం పంటలలో 90 శాతం దిగుబడిని తగ్గిస్తుంది. అలాగే వాటి పుప్పొడి టమాట, వంగ, మిరప, మొక్కజొన్న పుష్పాలపై పడినప్పుడు వాటిలో ఫలోత్పత్తి నిరోధించబడుతుంది. పార్థీనియం కొన్ని రకాల వైరస్‌లకు ఆశ్రయమిస్తూ, వివిధ పంటలలో వైరస్ వ్యాధులు వ్యాప్తి చెందడానికి కారణమవుతుంది.
- వేరుశనగ, టమాట, మిరప, ప్రొద్దుతిరుగుడు పంటలలో మొవ్వ కుళ్లు తెగుళ్లను వ్యాప్తి చేయడానికి కారణంగా మారుతుంది.
- మనుషులలో డెర్మటైటిస్, ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్, పుష్పాల పుప్పొడితో జలుబు, కండ్లు ఎర్రబడటం, కళ్ల రెప్పలు వాయడం మొదలైన ఆరోగ్య సమస్యలు సంభవిస్తున్నాయి.
- పశువులలో వెంట్రుకలు రాలిపోవడం, హైపర్‌టెన్షన్‌కు గురి కావడం జరుగుతుంది.

నివారణ పద్ధతులు

- మొక్కలు పూతకు రాకముందే చేతులకు తొడుగులు ధరించి పీకి వేసి తగులబెట్టాలి.
- బంతితో పంట మార్పిడి చేస్తే తర్వాత వేసే పైరులో పార్థీనియం ఉధృతి తక్కువగా ఉంటుంది.
- జైగోగ్రామా, బైకొలరేటా పురుగులను ఉపయోగించి జీవనియంత్రణ ద్వారా పార్థీనియంను నిర్మూలించవచ్చును.
- ఆయా పంటలలో సంబంధిత కలుపు నాశినిలను ఉపయోగించి కూడా నివారించవచ్చు.

సామూహిక నిర్మూలన చేపట్టాలి



సామాజిక ఆరోగ్య భద్రత దృష్ట్యా పార్థీనియం వంటి సమస్యాత్మక కలుపు మొక్కలను సమర్థవంతంగా నిర్మూలించడం అవసరం. సామాజిక పరంగా ఇది మనందరి బాధ్యత. అందుకే రాస్–కేవీకే ఆధ్వర్యంలో జిల్లాలో పార్థీనియం కలుపు మొక్క నివారణకు పెద్ద స్థాయిలో ప్రచారం చేపట్టి రైతులను, ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నాం. సామూహికంగా నిర్మూలించేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ శ్రీనివాసులు, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, తిరుపతి



కలుపు మొక్కలు పీకడంతో వచ్చిన చర్మ సమస్యలు, మొవ్వకుళ్లు సోకిన వేరుశనగ, టమాటలో మొవ్వకుళ్లు తెగులు

చలువ పందిరి దగ్ధం

తిరుపతి మంగళం: తిరుపతి– కరకంబాడి మార్గం చెన్నాయిగుంట సమీపంలోని తెలుగుగంగ పంప్ హౌస్ ఎదురుగా ఉన్న ఓ టీ స్టాల్ వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి దగ్ధమైంది. టీ స్టాల్ నిర్వాహకుడు గిరీష్ కథనం మేరకు.. శనివారం రాత్రి 9 గంటలకు దుకాణం మూసివేసామని, అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో చలువ పందిరికి మంటలు అంటుకుంది. స్థానికులు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. రెండు రోజుల క్రితమే కస్టమర్ల సౌకర్యార్థం పందిరి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు తెలిపాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వెల్లడించాడు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

చంద్రగిరి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి స్వల్ప గాయాలైన ఘటన ఆదివారం పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బెంగళూరు నుంచి తిరుపతికి వస్తున్న కారు, తిరుపతి నుంచి చంద్రగిరి వైపు వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సంతోష్‌కు స్వల్పగాయాలయ్యాయి. రాయలపురం సమీపంలోని రాహుల్ దాబా సమీపంలో తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు.

ఆరోగ్య శాఖ మంత్రికి సత్కారం

తిరుమలకు విచ్చేసిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, ఐఎంఏ జాతీయ సభ్యుడు డాక్టర్ శ్రీహరిరావు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలతో సత్కరించారు. – తిరుపతి తుడా



హథీరాం బావాజీ ఆలయంలో తొలి వివాహం



తిరుపతి రూరల్: మండలంలోని విద్యుత్ నగర్ సమీపంలో ఇటీవల నిర్మించిన హథీరాం బావాజీ ఆలయంలో ఆదివారం రాత్రి వివాహం నిర్వహించారు. దేశంలోనే తొలిసారి నిర్మించిన హథీరాం బావాజీ ఆలయంలో మొదటిసారి వివాహ కార్యక్రమం నిర్వహించారు. పెళ్లికొడుకు సంతోష్ నాయక్, పెళ్లికూతురు బుక్కె శ్నైలీ వివాహంలో హథీరాం బావాజీ ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు, ఇరు కుటుంబాల పెద్దలు పాల్గొన్నారు.